


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

### కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో
### అలనాటి అందమైన నవల పునర్ముద్రణ

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**"పద్మా!" అన్నాడు ఆవేశంగా.** "నేను నిన్ను విడిచి పెట్టి మళ్ళీ ఆ విశాఖపట్నానికి పోయి వుండలేను పద్మా. ఆ చదువు, ఆ యాంత్రికమైన వాతావరణం, ఆ ఒంటరితనం, చీకటి, అర్ధరాత్రి ఆలోచన్లు – నేను బ్రతకలేను పద్మా. నాకు మళ్ళీ ఆ శిక్ష విధించకు. నేను..నేను.."

ఆమెకు ఏడుపు వచ్చింది. "అట్లాగే వుంటుంది మధుబాబూ. కొంతకాలం అయినాక మళ్ళీ మామూలుగా అయిపోతారు. అలవాటయిపోతుంది" అంది దుఃఖాన్నాపుకుంటూ.

"లేదు పద్మా. నిన్ను విడిచి వుండలేను. నాకెవ్వరూ లేరు. నీతో యింకా యింకా గడపాలి. నాకు తనివి తీరలేదు. నీతో చాలా చెప్పాలి యింకా."

"ఎట్లాగ? ఏం చెయ్యను..."

"రేపు నా దగ్గరకు రా పద్మా."

"ఎంత కష్టం మధూ, నేనెట్లా తట్టుకోగలను?"

"నాకోసం.. తప్పదు పద్మా"

ఆమె నిట్టూర్చింది, "అట్లాగే మధుబాబూ"

అతని కళ్ళు సంతోషంలో మెరిశాయి. "నిజంగానా పద్మా."

"ప్రామిస్"

"వస్తాను. సెలవు" అంటూ అతను ఆమెని విడిచి వచ్చేశాడు.

ఎంత సంతోషంగా వుంది?

అవునవును ఎంతో దుఃఖంగా వుంది.

## 30

రాత్రంతా నిద్రపట్టలేదు మధుబాబుకు. అతనికి చిత్రంగా వుంది. ఏమిటీ బాంధవ్యం తమ యిద్దరి మధ్యా? అర్ధంలేని అయోమయ భ్రాంతి, ఆసక్తిలేని ఆకర్షణ. ఏం చేస్తూ వుంటుంది పద్మజ? కలవరపాటుతో నిద్రపోతూవుంటుందా?

తానిక్కడ నుంచి తిరిగి వెళ్ళలేడేమో అనిపిస్తోంది. జీవితము ఐపోయినట్లుగా వుంది.

ఆలోచనలతో తెల్లవారింది.

ఏడుగంటలకల్లా స్నానం చేసి బట్టలు వేసుకుని, రెండుసార్లు కాఫీ తాగేసి కూర్చున్నాడు. ఇక్కడకు వచ్చినప్పటి నుంచీ భోజనం సహించటం లేదు. అసలు ఆకలి అనేది యెవరికయినా వుంటుందా అనిపిస్తోంది.

ఇప్పుడప్పుడే ఆమె రాదని తెలుసు. అయినా యెదురు చూస్తూ కూర్చున్నాడు.

ఎనిమిది...తొమ్మిది...పది...పదకొండు..

గది బయట అడుగుల చప్పుడవుతోంది. అతను చేతిలో పట్టుకున్న పుస్తకంలోంచి తలయెత్తి చూశాడు. కిటికీలోంచి కనిపించింది ఆమె ముఖం. తలుపులు దగ్గరగానే వేసి ఉన్నాయి. తీసుకుని లోపలకు వచ్చింది "ఆలస్యం చేశానా?" అంది నవ్వుతూ.

అతను లేచి నిలబడి 'కూర్చోండి' అని కుర్చీ చూపించి తాను మంచమ్మీద దిండు లాక్కుని కూర్చున్నాడు. "ఆలస్యం చేయటానికి ఫలానా టైమని చెప్పలేదుగా" అన్నాడు.

పద్మజ అతని ముఖం కేసి చూస్తూ ముసిముసిగా నవ్వింది. ఆమె అలా నవ్వటం అతనికి చాలా ఇష్టమనిపించింది ముత్యాలవంటి పలువరసా, లేత చిగుళ్ళూ.. అతనికి ఎంతో బావుంది.

నిన్నటికీ ఇవ్వాల్టికీ యెంతో తేడా కనిపించింది ఆమెలో. నిన్న ఏదో బాధ దాచుకున్న దానిలా వుంది. ఇవాళ చిలిపిగా, అల్లరి పిల్లలావుంది. నిన్నటికన్న నిండుగా, గోముగా వుంది.

హఠాత్తుగా ఆమెని చూస్తే అతనికి జాలి వేసింది, తనకోసం ఇలా గదికి వచ్చినందుకు.

"కళ్ళు ఎర్రగా ఉన్నాయేం" అని ప్రశ్నించింది.

"ఊరికినే సరదాకి."

"ఏమిటలా ఊరికినే చూస్తారు, ఏమైనా చెప్పండి. ఎంత శ్రమపడి వచ్చానో తెలుసా?"

"చాలా శ్రమ కలిగిందా నీకు నావల్ల?"

"ఊ మరి మీరు నన్ను శాంతిగా వుండనిస్తారు గనుకనా" అంటూ ఆమె డ్రెస్సింగ్ టేబులు మీద చెల్లా చెదురుగా పడివున్న వస్తువుల్ని "సర్దనా వీటిని" అంది.

"సర్దండి చూద్దాం."

"ఊఁ సర్దను. నా ఇష్టం" అంటూ ఆమె అక్కడ వస్తువులన్నీ దువ్వెనా, తలనూనె సీసా అటూ ఇటూ కదిపి చప్పుడు చెయ్యసాగింది.

"చప్పుడు చేస్తే కోప్పడతారా?"

"ఉహూఁ" అంటూ చెంపమీద చిన్ని దెబ్బ వేస్తానని సౌంజ్ఞ చేసి చూపించాడు.

నిన్నటి బిడియము పోయింది. అతడామెకు యెంతో చేరువగా వచ్చేస్తున్నాడు. ఆమె అద్దంలోంచి అతనివంక తన్మయంగా చూసింది.

"మీకు ఎక్కువ కోపం వచ్చేస్తూంటుందా?"

"కొంచెం ఎక్కువగానే వచ్చేస్తూ వుంటుంది" అన్నాడు మధుబాబు.

"కేర్ చెయ్యను" అంది పద్మజ.

"మరి అహం ఎక్కడకు పోతుంది?"

పద్మజ సంతోషపడుతూ "అచ్చం ఉత్తరాల్లో మధుబాబులాగా మాట్లాడుతున్నారిప్పుడు. నిన్న అంత సీరియస్‌గా వున్నారేమిటి?" అంది.

"ఒక పులి బోనులో ప్రవేశించినట్లు ప్రవేశించాను నిన్న మీ యింటికి. యింటినిండా యెవరో అమ్మాయిలు. నువ్వేమో ఓ లార్డ్‌లా గదిలో కూర్చుని అక్కడికి రమ్మన్నావు. ఇంక సీరియస్‌గాక మరేమిటి?"

పద్మజ దిగులుగా నవ్వింది "అంతకంటే ఏమీ చేయలేకపోయను. మీ దగ్గరకు ఇలా రావాలంటే ఎంతో భయం వేసింది. అసలు రాగలుగుతాననుకోలేదు."

"ఎందుకు పద్మా నేనంటే భయం, నేనేం చేస్తానని" అన్నాడు మధుబాబు జాలిగా.

"మిమ్మల్ని చూసి కాదు, పరిస్థితుల్ని చూసి."

అతనేమంటాడు, ఒకటి రెండు క్షణాలాగి "భోజనం చేసి బయల్దేరావా పద్మా!" అనడిగాడు.

"ఆఁ ఏం?"

"ఏంలేదు కాఫీ తెప్పిద్దామని."

"భోంచేస్తే కాఫీ తెప్పించరా."

"ఆరోగ్యానికి మంచిది కాదు."

"మీరు అన్నం తిన్నారా."

అతను ఇబ్బందిలో పడి "లే....దు" అన్నాడు.

"ఎందుకనీ?"

"ఊరికినే – ఆకలిగా లేదు."

"ఐతే ఇక్కడకు తెప్పించుకొండి. మీరు తింటూంటే చూడాలని వుంది" అంది ఉత్సాహంగా పద్మజ.

"అహఁ నాకు సిగ్గేస్తుంది. నువ్వు తింటానంటే యిద్దరకూ తెప్పిస్తాను."

"అమ్మబాబోయ్! ఓ అరగంటకూడా కాలేదు. మీరు తినాలిసిందే" అంటూ ఆమె బలవంతం చేసింది. కాని అతను యెంతకూ తినకపోయే సరికి విసుక్కుని "అనుభవించండి. యెవరి కర్మకు ఎవరేం చేస్తారు" అంది.

"అవును కర్మే."

ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతనికి కనబడకుండా ఉండాలని, మాట మారుస్తూ "నాకు కాఫీ తాగాలని వుంది" అంది గారాబంగా.

అతను లేచి వెళ్ళి బాయ్‌ని పిలిచి కాఫీ తీసుకు రమ్మని చెప్పాడు.

"నాకు దాహం వేస్తోంది. మంచినీళ్ళు కావాలి" అంది పద్మజ మళ్ళీ.

అతను కిటికీలో వున్న గ్లాస్ తీసి, ప్రక్కనున్న బాత్‌రూమ్ లో టాప్ దగ్గర కడిగి, మంచినీళ్ళ కూజా దగ్గరకొస్తున్నాడు.

"నేను పోసుకుంటానులెండి."

"గొప్ప పని చేశారులెండి" అంటూ జాగ్రత్తగా నీళ్ళు నింపి ఆమె చేతికి అందించాడు.

ఆమె కొంచె తాగి "దాహం వెయ్యటము లేదు" అన్నది నవ్వి.

అతనుకూడా నవ్వి "నాకు తెలుసు" అన్నాడు.

"ఆ ఫ్యాన్ ఒట్టి అలంకారం కోసమా....వెయ్యరా?"

కూర్చోబోతున్నవాడల్లా లేచి ఫ్యాన్ స్విచ్ ఆన్ చేసి వచ్చాడు. చలివేయసాగింది.

"అబ్బ చలేస్తోంది, ఆపెయ్యండి బాబూ"

అతను లేచి ఫ్యాన్ ఆపేశాడు.

"అటూ ఇటూ త్రిప్పిస్తున్నానని కోపం వస్తుందా?"

"కొంచెం..."

"కోపం వస్తే చెంపలు వాయించేస్తారా?"

"ఉహూఁ చెవి మెలి పెట్టేస్తాను."

ఇంతలో కాఫీ వచ్చింది. బాయ్ వచ్చి ట్రేని బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు. మధుబాబు లేచి వెళ్ళి కొంచెం లేచి “ఆ మంచం మీద కూర్చుంటారా రాణీగారు. కాఫీ కలపాలి" అన్నాడు.

"నా పేరు పద్మ. రాణిగారు కాదు."

"నాకు మాత్రం రాణీగారే."

"అయితే మీరెవరు?"

"మీ సేవకుడ్ని."

"ఐతే నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను. కాఫీ తయారుచేసి ఇయ్యి."

"తమరు కాస్త కుర్చీలోంచి లేవండి."

ఆమె నవ్వుకుంటూ లేచి మంచం మీదకు వెళ్ళి కూర్చుని అతను పాలూ, డికషన్, పంచదారా జాగ్రత్తగా కలుపుతోంటే ఆసక్తిగా తిలకిస్తున్నది.

"తీసుకోండి" అతను కాఫీ కప్ ఆమెకు అందిచ్చాడు.

ఇద్దరూ కాఫీ తాగుతూ ఒకటి రెండు నిమిషాలు మౌనంగా ఊరుకున్నారు. "ఇలా సైలెంట్‌గా వుంటే నాకు బావుండదబ్బా" అంది పద్మజ వున్నట్లుండి.

"అయితే యిద్దరం కలిసి కేకలేద్దాం. అప్పుడు బాగుంటుంది."

ఆమె అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ "అవునుగాని మీరు నాకు ఉత్తరాలు రాయటం ఎందుకు మానేశారు?" అంది హఠాత్తుగా.

అతను విచలితుడయాడు. సంభాషణ యిలా తిరుగుతుందనుకోలేదు.

"చెప్పండి, అలా ఆపేయటం వల్ల నేనెంత బాధపడ్డానో, నా కళ్ళు ఎలా వర్షించాయో మీకేమైనా తెలుసా?"

మధుబాబు యిహ విధిలేక "రాశానా విషయం. మీకు పెళ్ళయిందన్న సంగతి తెలిసి..."

"నాకు పెళ్ళయితే రాయటం మానెయ్యాలా?"

అతను జవాబు చెప్పలేదు.

"మీ మొగవాళ్ళంతా యింతే. విశాల హృదయం వుండదు మీకు. నాకు పెళ్ళయి వున్నంత మాత్రాన నన్ను మరిచిపోవాలా మధుబాబూ! అప్పుడు నేను సన్నిహితంగా వుండకూడదా? నన్ను గురించి అన్యవిధంగా అందరిలా భావించవద్దని యెన్నిసార్లు సూచించాను. అంత స్వార్ధంగా ఎందుకు ఆలోచించాలి మీరు?" ఆమె కంఠం వొణికింది.

మధుబాబుకు ఆమె భుజాలు పట్టుకుని కుదిపి గట్టిగా అడిగేయాలనిపించింది. "ఓ యువతి, తనకు పెళ్ళి అయిన విషయం చెప్పకుండా దాచి, ఓ యువకుడ్ని స్వప్న సీమల్లో విహరింపజేసి, అతని హృదయవీణాతంత్రుల్ని మధురంగా మోగించి, అతనే తన సర్వస్వం అన్న భ్రమ కలిగించిన స్థితిలో – ఆ యువతిని పత్నిగా చేసుకునేందుకు అతను ఉబలాడపడితే అది స్వార్ధమా పద్మా!" అన్నాడు.

ఆమె చకితురాలైంది. అతనివంక విహ్వల దృష్టితో చూసింది.

"ఆమె వివాహిత అని తెలిసినప్పుడు అతను నరకం అనుభవించి, ఆ మహాయాతనలో అందని ఆ దేవతకోసం, తనకోసం ఏం చెయ్యలేని ఆమెను మరిచిపోదామని, ఫలితం లేని ఆవేదనలు పెంపొందించుకోవటానికి భయపడి, ఆమె జీవితాన్ని అశాంతిపాలు చేస్తున్నాననే భీతితో మౌనం వహిస్తే అది స్వార్ధమా పద్మా!"

ఆమె అలాగే చూస్తోంది, నిర్ఘాంతపోయి.

"నువ్వు నాకు సన్నిహితంగా వచ్చాక యే వొక్క అరగంటకూడా నీస్మృతి లేకుండా గడపలేక, దూరంగా నిన్ను తలచుకుంటూ, వంటరితనంలో అల్లాడిపోతూ, తోడుకోసం తపించిపోతూ నలిగి, నశించిపోయిన నా బ్రతుకు నీకెలా అర్ధమౌతుంది పద్మా!"

ఆమె కళ్ళలో నీళ్ళు తిరగసాగాయి.

"నన్ను గురించి నువ్వు ఓ రూపాన్ని నిర్మించుకున్నావు. దాన్ని ఆరాధించావు. ఆ విషయం రాసి నాకెంత క్లేశం కలిగించావో నీకు తెలీదు. నిన్ను గురించి నేను వో రూపం చిత్రించుకోలేకపోయాను. రూపంలేని నిన్ను ఆరాధించాను. నా

చంచల ప్రవృత్తితో నీకో బాహ్య స్వరూపం ఊహించి, అది తలుచుకుని ఉవ్విళ్ళూరటానికి నాఅంతరాత్మ అంగీకరించలేదు. నువ్వు యీ రూపంలో కాదు. ఎలా వున్నా యిదే నిశ్చల చిత్తంతో నీ ముందు నిల్చుని వుండేవాడ్ని."

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

"నాకే పెళ్ళయివుండి, నువ్వు అవివాహితవై వుంటే యిదే ఉద్రేకంలో నేను రాసివుంటే అది నిశ్చల ప్రేమగా, నిజాయితీగా నువ్వు హర్షించేదానివా పద్మా. నేను అన్యాయం చేశానని, నమ్మించి మోసం చేశానని నిందించేదానివికదా? ఎంత కోపగించుకుని, అసహ్యించుకుని వుండేదానివి. కాని ఆశ్చర్యం. నువ్వంటే నాకీ రెండూ లేవు పద్మా!"

"అబ్బ! చెప్పకు మధూ. అలాంటి సత్యాలు నాకు చెప్పకు. నేను భరించలేను" అని ఆమె యిహ ఆపుకోలేక ఏడవసాగింది.

అతను కదలకుండా, విషాదంగా ఆమె ముఖం కేసి చూస్తున్నాడు.

పద్మజ సిగ్గుపడి, పమిట చెంగుతో కల్ళు తుడుచుకుని కుదురుగా కూర్చుంది.

మధుబాబు హటాత్తుగా "నువ్వెందుకు పెళ్ళి చేసుకున్నావు పద్మా? ఎందుకలా చేశావు?" అన్నాడు గాద్గదిక కంఠంతో.

పద్మజకు అంత దుఃఖంలోనూ నవ్వు వచ్చింది. ఆమె పెదిమలు నిర్మల అమాయక హృదయాన్ని వ్యక్తం చేస్తూ విప్పారినై.

"చెప్పు పద్మా నువ్వు చెప్పిందంతా అబద్ధమేననీ, నువ్వు అవివాహితవేననీ చెప్పు" అన్నాడతను ఆవేశంగా.

"నాకు పెళ్ళయిందని నీకు నమ్మకంలేదా?" అన్నదామె.

"ఉహూఁ" అన్నాడతను మొండిగా.

నిజానికి ఆమె కంఠాన మంగళ సూత్రం కనబడటంలేదు. అది చూసి అతను అపోహపడలేదు. ఊరికినే మొండిగా అన్నాడు.

పద్మజ తన పమిట కాస్త ప్రక్కకి తొలిగించి, హృదయాన రవికలో నుండి కనబడుతున్న మంగళసూత్రాన్ని చూపించి "అనుమానం తీరిందా?" అంది.

"నాకు ముందే తెలుసు పద్మా!" అన్నాడతను నిరాశగా.

"నువ్వు పెళ్ళి చేసుకో మధూ! నీ పెళ్ళికి నేను వస్తాను. హడావుడిగా అటూ ఇటూ తిరిగి, చకచకా పనులన్నీ చేసేస్తూ పెత్తనం చెలాయిస్తాను. మీ అమ్మగారూ, నాన్నగారూ నన్ను చూసి "యీ పిల్ల మా ఇంట్లో వుంటే బాగుండేది" అని అనుకునేట్లు చేస్తాను.

"ఉహూఁ నేను పెళ్ళి చేసుకోను."

"ఏం?"

"నాకు కావాల్సిన వ్యక్తి దొరకదు కనుక"

"ఎందుకు దొరకదు? ఎక్కడ తపస్సు చేస్తోందా పిల్ల?"

"లేదు.. లేదు అలాంటి పెళ్ళికాని పిల్లలే లేనేలేదు.

మధుబాబు "నిన్ను విడిచి, మళ్ళీ ఆ అజ్ఞాతవాసానికి ఎలా వెళ్ళను పద్మా"అన్నాడు దిగులుగా.

"ఒక విషయం చెప్పనా?" అన్నది ఆమె బొటన వేలితో నేలమీద రాస్తూ.

అతను ప్రశ్నార్ధకంగా చూశాడు.

"నన్ను మరచిపోండి."

"అలాంటి మాటలు మాట్లాడకు పద్మా!"

"అబ్బా మధూ ఈ చుట్టు గీతలలో నిన్ను నేను కలుసుకోలేకుండా వున్నాను. ఈ అవస్థ భరించలేను. నేనిలా వస్తూంటే ఏం జరుగుతుందో కూడా తెలీదు. నా జీవితం ఏమైనా ఐపోవచ్చు. నేను నశించిపోవటం నీకిష్టమా మధూ?"

"అబ్బ? ఏం చెయ్యను పద్మా! నన్నిలా ఎందుకు చేశావు? నువ్వు వెళ్ళిపోయిన క్షణం నుంచీ రంపపు కోత. నీ దగ్గరకు, మీ ఇంటికి పరిగెత్తుకు వచ్చేయ్యాలని ఉంటుంది. రాత్రిళ్ళు ఊరికినే వచ్చి మీ యింటి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాను. ఒక్కడ్నే వెనక్కి ఎలా వెళ్ళిపోయేది నేను"

"మీరు ఇవాళే వెళ్ళిపోండి."

"పద్మా!"

"అవును మీరింకా ఇక్కడవుంటే నేను మీతో వచ్చేస్తానేమోనని భయంగా వుంది. వెళ్ళిపోండి మధుబాబూ."

"ఒక్కసారి కళ్ళు మూసుకోండి మధుబాబూ"

"ఏమిటి?"

"ఊహూఁ చెప్పను సిగ్గేస్తోంది. కళ్ళు మూసుకోండి."

అతను కళ్ళు మూసుకున్నాడు.

ఆమె అతనికి ఎదురుగా వచ్చి నేలమీద మోకాళ్ళపై కూర్చుని అతని పాదాలకు నమస్కారం చేసింది.

అతను కళ్ళు తెరిచాడు. ఆ దృశ్యం చూసి అతడి హృదయం చలించిపోయింది శరీరం గగుర్పొడిచింది. "పద్మా" అంటూ ఆవేశంగా ఆమె భుజాలు పట్టుకుని పైకి లేవదీశాడు భయంగా అదోరకంగా వుంది. అదే ఆమెను మొట్ట మొదటిసారి తాకటం.

"నా వాగ్దానం గుర్తుందా? ఇలా సెలవు తీసుకుంటున్నాను" అంది పద్మజ కళ్ళు క్రిందకు వాల్చి.

అతనో చేతితో ఆమె ముఖం పైకెత్తి "ఎన్ని కలలు కన్నాను పద్మా. నేను పురుషుడ్ని. నువ్వుప్రకృతివీ అనుకున్నాను. నా తనివి తీరేదాక నిన్ను నాతో ఎక్కడెక్కడికో తీసుకుని, కబుర్లలో, మహదానందంలో, గొప్పగా వెళ్ళిపోదామనుకున్నాను. అంతా.." అతని గొంతు వణికింది. "వొట్టికలే"

"ఐతే నన్ను తీసుకు వెళ్లండి" అన్నది పద్మజ.

అతనాశ్చర్యంగా చూశాడు.

"అవును. తీసుకువెళ్ళండి" మీ ఇష్టం వచ్చినంత దూరం తీసుకువెళ్ళండి. కాని వచ్చేటప్పుడు మాత్రం మీరొక్కరే తిరిగిరావాలి. నన్నక్కడే పడవేసి, పారవేసి. మరి ఈ ప్రపంచం, ఇల్లు, సంసారం నన్ను స్వీకరించరుగా."

అతడామెను వదిలేసి "పద్మా!" అన్నాడు వెర్రిగా.

***(ముగింపు వచ్చే నెలలో)***

Post your comments